ప్రజాశక్తి
ఆదివారం 30 నవంబర్ 2025
5
పార్వతీపురం మన్యం

జాతీయస్థాయిలో జిల్లాకు ఐదో ర్యాంక్

పార్వతీపురం : ఆకాంక్షిత జిల్లాల కార్యక్రమంలో జాతీయ స్థాయిలో మన్యం జిల్లా టాప్-5 ర్యాంక్‌ను సాధించిందని కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో అద్భుతమైన పనితీరును కనబర్చి, మార్చి 2025లో ఉన్న 93వ డెల్టా ర్యాంక్ నుంచి జూన్ 2025 నాటికి 4వ డెల్టా ర్యాంక్‌కు దూసుకువెళ్లిందని అన్నారు. జిల్లా కాంపోజిట్ స్కోర్ సుమారు 50.2 నుంచి 70.3కి పెరిగిందని, ఇది ఎడిపిలోని ఐదు ప్రధాన అంశాల్లోనూ గణనీయమైన మెరుగుదలను ప్రదర్శిస్తుందని పేర్కొన్నారు. జిల్లా ప్రాథమిక మౌలిక సదుపాయాల కల్పనలో జాతీయంగా ఒకటో ర్యాంక్ సాధించిందని, అలాగే, విద్యా రంగంలో 108 స్థానాలు ఎగబాకి (80వ స్థానం నుండి 11వ స్థానానికి) భారీ స్కోర్ పెరుగుదలతో అగ్రస్థానాలను అందుకుందని చెప్పారు. డేటా-ఆధారిత పాలనపై నిరంతర దృష్టి సారించడంతో జిల్లాను దేశంలోని అత్యుత్తమ ఆకాంక్షిత జిల్లాల లీగ్‌లోకి చేర్చిందని స్పష్టం చేశారు.

ప్లాస్టిక్ రహిత జిల్లాగా పార్వతీపురం

రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ పి.కృష్ణయ్య

ప్రజాశక్తి - పార్వతీపురం

మన్యం జిల్లాను ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ డాక్టర్ పి.కష్ణయ్య ఆకాంక్షించారు. జిల్లాలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించేలా చర్యలు తీసుకోవాలని, ఆ దిశగా అధికారులంతా కృషి చేయాలని పేర్కొన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయించే షాపులపై దాడులు నిర్వహించి విక్రయాలు లేకుండా చూడాలని అన్నారు. జిల్లాలో మంచి ఆలోచనలు చేసే జిల్లా కలెక్టరుతో పాటు సమిష్టిగా పనిచేసే జిల్లా అధికారులు ఉన్నారని కితాబిచ్చారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కాలుష్య నియంత్రణపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జట్టు స్వచ్ఛంద సంస్థ చెత్తను సేకరించి, పర్యావరణ పరిరక్షణకు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అదే మాదిరిగా జిల్లాలో మరిన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సాలూరులో నీటి వనరులున్న చోట చెత్తను వేయడం గమనించడం జరిగిందని, చెత్తను వేరే ప్రాంతానికి తరలించి, ఆ ప్రాంతాన్ని ఒక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. బయో ప్లాస్టిక్, గుడ్డ సంచులు వినియోగం వల్ల ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. స్వచ్ఛంద సంస్థలు, మున్సిపాలిటీల భాగస్వామ్యంతో పాటు ప్రజలు వ్యక్తిగతంగా ముందుకొస్తే ప్లాస్టిక్ రహిత జిల్లాగా పార్వతీపురం సాధ్యం కాగలదని ఆశాభావం వ్యక్తం చేశారు.

కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో స్వచ్ఛ పార్వతీపురం అనే కార్యక్రమం దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. ప్రతి గ్రామంలో పారిశుధ్యం పట్ల సర్పంచులను బాధ్యులను చేశామని, అలాగే కార్యదర్శిలు, ఎంపిడిఒలు ఆ పనిమీదే ఉన్నారని అన్నారు. అలాగే మున్సిపాలిటీల్లో 'మన వీధి మన బాధ్యత' అనే కార్యక్రమం చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో జెసి కలెక్టర్ సి.యుశ్వంత్ కుమార్ రెడ్డి, సబ్ కలెక్టర్ వైశాలి, కాలుష్య నియంత్రణ మండలి ఇఇ కరుణశ్రీ, డిఇఒ బి.రాజ్ కుమార్, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ కృష్ణయ్య

రోడ్లపై చెత్త వేయకుండానే నగరం నెంబర్ వన్

స్వచ్ఛతపై మన వైఖరి మారాలని, చెత్త వేయకుండా ఉంటేనే నగరానికి నంబర్ వన్ ర్యాంకు దక్కుతుందని కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి స్పష్టం చేశారు. జిల్లాను స్వచ్ఛ పార్వతీపురంగా తీర్చిదిద్దేందుకు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంపై ప్రత్యేక దృష్టి సారించారు. అందులో భాగంగా స్థానిక పార్వతీపురం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించిన మన - వీధి మన బాధ్యత' అనే అవగాహన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. పట్టణంలో చెత్త సమస్య కొనసాగడంపై ఆవేదన వ్యక్తం చేశారు. చెత్త వేసిన తర్వాత కూడా తీయకపోవడం చదువురాని సమాజ లక్షణమని, చెత్త వేయకుండా క్లీన్ చేయడమనేది చదువుకున్న సమాజం లక్షణమని పేర్కొన్నారు. పట్టణాన్ని అందంగా, శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత కేవలం అధికారులది మాత్రమే కాదని, ప్రతి పౌరుడిదని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో డిఆర్ఒ కె.హేమలత, సబ్ కలెక్టర్ వైశాలి, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, పట్టణంలో వివిధ దుకాణ సముదాయ వర్తకులు తదితరులు ఉన్నారు.

అలరిస్తున్న సాహిత్య కార్యక్రమాలు

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ సాంస్కృతికశాఖ, ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుస్తక మహోత్సవం పుస్తక ప్రియులను ఆకట్టుకుంటోంది. ఐదవ రోజు శనివారం సాహిత్య, సాంస్కృతిక వేదిక రచయిత తుంబలి శివాజీ అధ్యక్షతన జరిగింది. రచయిత బాల సుధాకర్ మౌళి రచించిన పున్నెమ్మ కథల పుస్తకాన్ని పాలకొల్లు రామలింగేశ్వర స్వామి పరిచయం చేశారు. మరో కవి, రచయిత సిరికి స్వామి నాయుడు సామాజిక గీతాలాపన చేపట్టారు. తిరుపతి దాలినాయుడు కళింగాంధ్ర చరిత్రలను ప్రస్తావించి వివరించారు. ఈ సందర్భంగా కావ్యశ్రీ నృత్య కళాశాల

పున్నెమ్మ కథల పుస్తక పరిచయ సభలో మాట్లాడుతున్న రామలింగేశ్వరస్వామి

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

కావ్యశ్రీ నృత్య కళాశాల చిన్నారుల ప్రదర్శనలు

వారి శాస్త్రీయ నృత్యం, అర్ధ నాగేశ్వరి కూచిపూడి, స్నేక్ డ్యాన్స్ , భరతనాట్యం నృత్యాలతో ఐదో రోజు కళా వేదిక అబ్బురపరిచింది. పార్వతీపురానికి చెందిన పార్వతీనగర్ శ్రావణి, శ్రీనివాస ఉపాధ్యాయులుగా ఈ పాఠశాల నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ విద్యార్థులకు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు ఉందని పేర్కొన్నారు. అనంతరం పెద్దమరికి గ్రామానికి చెందిన శ్రీ ఎర్రకంచమ్మ కోలాట కమిటీ ఆధ్వర్యంలో కోలాటం చేపట్టారు. మరోవైపు పుస్తక మహోత్సవంలో ఏర్పాటు చేసిన వివిధ రకాల పుస్తకాలను పుస్తక ప్రియులు తిలకించి, కొనుగోలు చేస్తున్నారు. పుస్తక మహోత్సవానికి విశేష స్పందన లభిస్తోంది.

2న అండర్- 12 క్రికెట్ జట్టు ఎంపికలు

విజయనగరం టౌన్ : వచ్చే నెల 2న విజ్జి స్టేడియంలో అండర్ - 12 బాలుర జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తామనిజిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి పి.సీతారామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు 2013 సెప్టెంబర్ 1 తర్వాత జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఒరిజినల్ జనన, స్టడీ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు తీసుకు రావాలని తెలిపారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు

అధికారుల వద్ద ప్రభుత్వ పథకాల సమాచారం ఉండాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లాలో అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల పట్ల అధికారులకు పూర్తి అవగాహన ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి పేర్కొన్నారు. అలాగే వాటికి సంబంధించిన సమగ్ర సమాచారం అధికారుల వద్ద ఉండాలని తేల్చిచెప్పారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసే పలు పథకాల పురోగతిపై ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని శనివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్బంగా కలెక్టర్ జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలవుతున్న పలు పథకాల గురించి వివరాలు అడిగి తెలుసుకొని, జాప్యానికి గల కారణాలపై ఆరా తీశారు. మీ స్థాయిలో చేపట్టాల్సిన లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా సాధించాలని అన్నారు. నిధులు, ఇతరత్రా సమస్యలు ఉంటే వాటిని తమ దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వంలో పెండింగ్ ఉన్న పనుల వివరాలను ఎంపి దృష్టికి తీసుకువెళ్లి నిధులు విడుదలయ్యేలా చూసుకోవాలని కలెక్టర్ హితవు పలికారు. సమావేశంలో ఎల్‌డిఎం ఎన్.విజయ్ స్వరూప్, ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, డిఆర్‌డిఎ పీడీ ఎం.సుధారాణి, జిల్లా పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ ఎం.వి.కరుణాకర్, జిల్లా పశు సంవర్ధక అధికారి ఎస్.మన్మధరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.భాస్కర రావు, సీపీఓ ఎస్.ఎస్.ఆర్. పట్నాయక్, బీసీ సంక్షేమ అధికారి ఇ.అప్పన్న, జిల్లా రవాణా అధికారి టి.దుర్గా ప్రసాద్, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, జిల్లా అధికారులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాంచాలిలో ప్రవేశించిన సైకిల్ ర్యాలీలో పాల్గొన్న ఎఎస్‌పి వెంకటేశ్వరరావు, ప్రజాప్రతినిధులు, పోలీసులు

పోలీసు శాఖ సైకిల్ యాత్ర

ప్రజాశక్తి - పాచిపెంట

గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా విశాఖపట్నం రేంజ్ పరిధిలో ప్రారంభించిన 'అభ్యుదయం సైకిల్ యాత్ర' శుక్రవారం విజయనగరం జిల్లా రామభద్రపురం మండలంలో విశేష స్పందనతో కొనసాగింది. తొలుత రామభద్రపురం జంక్షన్‌లో గంజాయి, మాదక ద్రవ్యాల పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అక్కడ నుంచి అభ్యుదయం సైకిల్ ర్యాలీ కోలాటాలు, వాయిద్యాలు, డిజెల నడుమ జన సందోహంతో కలిసి మార్గ మధ్యలో కరపత్రాలు పంచుతూ, ప్లకార్డులు చూపిస్తూ డ్రగ్స్‌పై నినాదాలు చేస్తూ విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కలిపిస్తూ మన్యం జిల్లాలోకి ప్రవేశించింది. ఈ మేరకు మండలంలోని పాంచాలికి సైకిల్ ర్యాలీ చేరుకోగా ఎఎస్‌పి ఎం.వెంకటేశ్వరరావు, పోలీస్ అధికారులు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. అనంతరం పాంచాలిలో ర్యాలీగా కోలాటాలు, వాయిద్యాలు, డిజె, తప్పెటగుళ్లతో మార్గ మధ్యలో కరపత్రాలు పంచుతూ, ప్లకార్డులు చూపిస్తూ, డ్రగ్స్ పై నినాదాలు చేస్తూ, మత్తు పదార్థాల వలన కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఎఎస్‌పి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చే ప్రక్రియలో అనేక అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందని, అలాగే యువత భవిష్యత్తును కాపాడేందుకు విద్యాసంస్థలను మత్తురహిత ప్రాంతాలుగా మార్చడం అవసరం అన్నారు. గంజాయి అమ్మినా, కలిగివున్నా, తరలించినా నేరమేనని తెలిపారు. గంజాయి ఇతర అసాంఘిక కార్యక్రమాల గురించి సమాచారం తెలిస్తే వెంటనే 1972కు, 100/112కు లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేసారు. అనతరం డ్రగ్స్ వద్దు బ్రో అనే నినాదాలు చేశారు. అనంతరం ఎస్ఐ వెంకట సురేష్ అందరితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గురువ నాయుడు పేట మీదుగా పాచిపెంట గ్రామానికి చేరుకున్నారు. విద్యార్థులు, యువత ర్యాలీతో పాటు నడుస్తూ మాదకద్రవ్యా లకు వ్యతిరేకంగా సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సాలూరు రూరల్, పట్టణ, కొఠియా సిఐలు రామకృష్ణ, అప్పలనాయుడు, క్రాంతి కుమార్, మక్కువ ఎస్సై వెంకట రమణ, ఈగల్ సిబ్బంది, ఎఎంసి చైర్మన్ ఎం.సూర్యనారాయణ, పాంచాలి సర్పంచ్ జి.యుగంధర్, గురువు నాయుడుపేట పిహెచ్‌సి వైద్యాధికారి, ప్రజానాయకులు, యువత, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలి

బస్తాకు 300 రూపాయల వరకు నష్టపోతున్న రైతులు
ఎమ్మెల్యేలు, అధికారులది ఆర్బాటమే : సిపిఎం

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం తప్ప ఎక్కడా పూర్తి స్థాయిలో కొనుగోలు చేయడం లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు విమర్శించారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన విలేకరుల ఆయన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతులు దళారులకు అమ్ముకుంటున్నారని, ఒక్కొక్క రైతు 80 కేజీల బస్తా ధాన్యానికి రూ.300 వరకు నష్టపోతున్నారని అన్నారు. 80 కేజీల బస్తా వద్ద మిల్లర్లు అదనంగా నాలుగు కేజీలు తీసుకుంటున్నారని, ఇది అన్యాయమని అన్నారు. అదనంగా తీసుకున్న నాలుగు కేజీలు బహిరంగ రహస్యమై పోయిందని ప్రభుత్వం, అధికారులు అదనంగా ధాన్యం తీసుకుంటున్న వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పడం తప్ప ఎక్కడా అటువంటి చర్యలు కనిపించడం లేదని చెప్పారు. యంత్రాలు వచ్చిన తర్వాత వారం, పది రోజుల్లోనే వరినూర్పులు పూర్తవుతున్నాయని, ధాన్యాన్ని రైతులు దాచుకోలేక తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో అమ్ముకోవడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఇదే అదునుగా దళారీలు తక్కువ ధరకు ధాన్యం కాజేస్తున్నారన్నారు. జిల్లాలోని మంత్రి, ఎమ్మెల్యేలు ప్రచారం కోసం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం తప్ప ఎక్కడా కేంద్రాల్లో కొనుగోలు చేయలేదని చెప్పారు. కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకువెళ్లాలంటే అనేకమైన ఆంక్షలు ఉన్నాయని, జిపిఎస్ ద్వారా రవాణా (వాహనం) సౌకర్యం కల్పించుకోవాలని, అది రైతులకు సాధ్యం కాదని అన్నారు. ఇప్పటికైనా ఎటువంటి ఆంక్షలు లేకుండా రైతుల వద్ద ఉన్న ధాన్యం మొత్తం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయించాలని డిమాండ్ చేశారు. లేకపోతే రైతు సంఘాల ఆధ్వర్యాన రైతులను కదిలించి అందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు, ఎన్‌వై నాయుడు, కద్రక రామస్వామి పాల్గొన్నారు.

వరహాల గెడ్డ భూమి చుట్టూ కంచె

సబ్ కలెక్టర్ ఆదేశాలతో కదిలిన అధికారులు

ప్రజాశక్తి - పార్వతీపురం

పట్టణ నడిబొడ్డున ఉన్న వరహాల గెడ్డ భూమి చుట్టూ సిమెంట్ స్థంబాలతో కంచె నిర్మాణానికి మున్సిపల్ అధికారులు సిద్ధమయ్యారు. సర్వే నెంబర్ 410లో ఉన్న వరహాల గెడ్డ భూమి చుట్టూ ఇప్పటికే ట్రెంచ్ ఏర్పాటు చేశారు. నిర్ధేశించిన హద్దు మేరకు సిమెంట్ స్తంభాలతో కంచె నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఈ స్థలంపై కన్నేసిన కొంతమంది బడాబాబులు కంచె వెయడంతొ వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు ఇటీవల సబ్ కలెక్టర్ వైశాలికి ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఆమె స్పందిస్తూ వరహాల గెడ్డ భూమి చుట్టూ సిమెంట్ స్తంభాలతో కంచె నిర్మించాలని ఆదేశించారు.

ఆక్రమిత స్థలం చుట్టూ కంచె వేస్తున్న కూలీలు

అర్తాలిలో వైద్య శిబిరం

పాలకొండ : ండలంలోని అర్తాలిలో శ్రీ విజయ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో సచివాలయం దగ్గర శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 250 మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిపి బొమ్మల భాను మాట్లాడుతూ ఇలాంటి వైద్య శిబిరాలు పెట్టడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైద్యులు వేలంగణి, మార్కెట్ మేనేజర్ బొమ్మల రవి ఉన్నారు.

పారదర్శకంగా జిసిసి టెండర్ ప్రక్రియ

ప్రజాశక్తి -పార్వతీపురం

ఐటిడిఎ పరిధిలోని గిరిజన సంక్షేమ విద్యా సంస్థలకు సంబంధించిన జిసిసి కమోడిటీ టెండర్ల ప్రక్రియ పారదర్శకంగా జరిగిందని జాయింట్ కలెక్టర్, స్థానిక ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం గిరిమిత్ర హాలులో జరిగిన టెండర్ ప్రక్రియను పీఒ పర్యవేక్షించారు. ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ విద్యా సంస్థలు, హాస్టళ్లకు అత్యవసరమైన, నాణ్యమైన సరుకులను సరఫరా చేయడానికి ఉద్దేశించబడిందన్నారు. ఈ టెండర్ ప్రక్రియ పారదర్శకంగా, పద్ధతి ప్రకారం జవాబుదారీగా నిర్వహించబడిందని, దీని ద్వారా గిరిజన సంక్షేమ హాస్టళ్లు, విద్యా సంస్థలకు అధిక నాణ్యత గల నిత్యావసర వస్తువులు సక్రమంగా అందించబడతా యని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎపిఒ పి.మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ ఎంపిక

సమావేశంలో భిన్న వాదనలు

ప్రజాశక్తి -సాలూరు

మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ అధ్యక్షతన శనివారం నిర్వహించిన సాధారణ సమావేశంలో మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ ఎంపికైంది. స్టాండింగ్ కౌన్సిల్ ఎంపిక అంశం అజెండాలో వచ్చినప్పుడు కౌన్సిలర్ల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఇద్దరు న్యాయవాదుల మధ్య ఎన్నిక అనివార్యమైంది. ఎన్నిక లేకుండా ఈ అంశాన్ని వాయిదా వేయాలని చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ కోరినా కౌన్సిలర్లు అంగీకరించలేదు. న్యాయవాది షణ్ముఖ ముత్యాలు ని 13మంది కౌన్సిలర్లు బలపరిచారు. దీంతో ఆయన ఎన్నికైనట్లు ప్రకటించారు. సమావేశంలో వైసిపి కౌన్సిలర్ల మధ్య భిన్నాభిప్రాయాలు కనిపించాయి.

టెన్త్‌లో శత శాతం ఉత్తీర్ణత సాధించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని పదో తరగతి చదువుతున్న విద్యార్థులంతా శత శాతం ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. పదో తరగతి ఫలితాల్లో గత మూడేళ్లుగా రాష్ట్రస్థాయిలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపారని, అదే స్ఫూర్తితో ఈ ఏడాది కూడా ప్రథమ స్థానంలో నిలపాలని కలెక్టర్ ఆకాంక్షించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మై స్కూల్ - మై ప్రైడ్ కార్యక్రమంపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది పదో తరగతి ఫలితాలు శతశాతం సాధించడమే లక్ష్యం కావాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. జిల్లాలో అమలు చేస్తున్న ముస్తాబు కార్యక్రమంతో విద్యార్థుల ఆరోగ్యంలో ఘననీయమైన మార్పు వచ్చిందని, ఒక్క కేసు కూడా నమోదు కాలేదని స్పష్టం చేశారు. విద్యార్థులకు చదువుపైనే కాకుండా ఆరోగ్యం, మానసిక ఉల్లాసం కోసం పాఠశాలల్లో 'ఆనందలహరి' కార్యక్రమాన్ని ప్రవేశపెట్టామన్నారు. ప్రతి ఒక్కరూ అట, పాటల్లో కూడా ఉండాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, సబ్ కలెక్టర్ వైశాలి, డిఇఒ బి.రాజ్ కుమార్, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల రవాణాను అరికట్టాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల అక్రమ రవాణాను, వినియోగాన్ని పూర్తిగా అరికట్టాలని జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి అధికారులను ఆదేశించారు. గ్రామస్థాయిలో డ్రగ్స్, గంజాయి నివారణపై మైకు ద్వారా అవగాహన కల్పించాలని అన్నారు. ఇందుకోసం ప్రతీ 10 ఇళ్లకు ఒక వాలంటీరును ఏర్పాటు చేసుకొని ప్రచారం నిర్వహించాలని సూచించారు. అలాగే ప్రతి కళాశాలలోని విద్యార్థులకు డ్రగ్స్ అక్రమ రవాణా, గంజాయి, మత్తు పదార్థాల నివారణ పట్ల అధ్యాపకుల ద్వారా చైతన్యపర్చాలని చెప్పారు. గ్రామస్థాయిలో పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల అక్రమ రవాణా, నివారణ, అట్రాసిటీ కేసులు, బాల్య వివాహాలు నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. జిల్లా స్థాయి మాదక ద్రవ్యాల నియంత్రణ కమిటీ, జిల్లాస్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశాలు కలెక్టర్, ఎస్పీ ఎస్‌వి మాధవ్‌రెడ్డి అధ్యక్షతన కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం జరిగింది. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సంతలు జరిగే ప్రదేశాలు, షాపులు వద్ద మత్తు పదార్థాల విక్రయించే వారి వివరాలు అందజేసేలా నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. గంజాయి, నాటు సారా వంటి మత్తు పదార్థాలు, బాల్య వివాహాలు, మహిళల అక్రమ రవాణా వంటి వాటిపై వేర్వేరుగా సమావేశాలను నిర్వహించకుండా, అందరు అధికారులు సమన్వయం చేసుకొని ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. అలాగే రవాణా, అటవీ, ఆర్‌టిసి, ఎక్సైజ్ తదితర శాఖల ద్వారా నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీలు, చైతన్య కార్యక్రమాలను దాడుల్లో పట్టుకున్న సరుకుల వివరాలను తమకు, పోలీస్, సబ్ కలెక్టర్లకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామంలో జరిగిన విషయాలకు స్థానిక సర్పంచ్ బాధ్యత వహించాల్సి ఉంటుందన్న ఈ విషయాన్ని వివరించాలన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వలన కలిగే దుష్ప్రభావాలపై గ్రామ స్థాయిలో విద్యా సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అనంతరం రహదారి భద్రతపై మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాలు నివారించాలని, ఇందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అన్ని పట్టణ రద్దీ ప్రదేశాల్లో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు.

ఎస్‌పి మాట్లాడుతూ జిల్లాలో మత్తు పదార్థాల కట్టడికి చేపడుతున్న కట్టుదిట్టమైన చర్యలను కలెక్టర్ కు వివరించారు. జిల్లాలో ప్రమాదాలను పూర్తిగా నివారించేందుకు జిల్లా యంత్రాంగంతో కలిసి కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే హెల్మెట్ ధారణ, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపేవారిపై అపరాధ రుసుం విధిస్తున్నట్టు తెలిపారు. బ్లాక్ స్పాట్‌ల వద్ద బోర్డులను ఏర్పాటుచేసి ప్రమాదాలను నివారిస్తున్నామన్నారు. సమావేశంలో సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, డిఎస్‌పి ఎం.రాంబాబు, ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, డిఆర్‌డిఎ పీడీ ఎం.సుధారాణి, జిల్లా పశు సంవర్ధక అధికారి ఎస్.మన్మధరావు, డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కర రావు, సిపిఒ ఎస్.ఎస్.ఆర్.పట్నాయక్, బిసి సంక్షేమాధికారి ఇ.అప్పన్న, జిల్లా పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ ఎం.వి.కరుణాకర్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎ. సంతోష్, డిఇఒ బి.రాజకుమార్, జిల్లా రవాణా అధికారి టి.దుర్గాప్రసాద్, జిల్లా ప్రజా రవాణా అధికారి పి.వెంకటేశ్వరరావు, ఇతర జిల్లా అధికారులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

మంత్రి మౌనం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

మౌనం అర్ధ అంగీకారం అంటారు.... రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మౌనాన్ని మరి ఏమనుకోవాలి అంటూ జిల్లాలో పబ్లిక్ టాక్ నడుస్తోంది. మంత్రిగారి అనధికారిక పిఎ తనను లైంగికవంగా వేధిస్తున్నాడంటూ సాలూరుకు చెందిన ఓ మహిళ ఎస్పీకి ఫిర్యాదు చేసిన సంగతి జిల్లాలో చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. ఇందులో మంత్రి కుమారుడి పేరు కూడా ప్రస్తావనకు వచ్చింది. వేధింపుల విషయమై మంత్రికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని కూడా బాధిత మహిళ మీడియా ముందు ఆవేదన వ్యక్తం చేసింది. ఈ వ్యవహారం రచ్చకెక్కి నాలుగు రోజులు కావస్తున్నా మంత్రి మాత్రం మౌనం వీడలేదు. ఈ నేపథ్యంలో మౌనం అర్ధ అంగీకారం అన్న సామెతను సాలూరు సహా మన్యం జిల్లాల్లో ఎక్కువ మంది గుర్తు చేస్తున్నారు. ఇంతకీ మంత్రి ఎందుకు నోరు మెదపడం లేదన్నది జిల్లావాసుల నుంచి తలెత్తున్న ప్రశ్న. ఆమె పిఎ అన్న విషయం కాసేపు పక్కనబెడితే....ఆమె రాష్ట్ర మంత్రి. తన సొంత నియోజకవర్గానికి చెందినసాటి మహిళ అందులోనూ ఆమె కుమారుడిపై ఆరోపణలు చేసింది. ఇటువంటి సందర్భంలో హుందాగా, బాధ్యతగా స్పందించి, అధికార యంత్రాంగానికి దశదిశ నిర్ధేశించడంతోపాటు ప్రజలకు ఒక క్లారిటీ ఇవ్వాల్సిన మంత్రి మౌనం వహించడంతో జనం అంతర్థాలు వెతుకుతున్నారు.



నిందితుడు ఆమె పిఎ కావడం అందులోనూ కొడుకు ప్రస్తావన ఉండడం వల్లే మంత్రి సమాధానం చెప్పుకోలేక పోతున్నారా? లేక మహిళల సమస్యలు మంత్రికి చిన్నవిగానో, పనికిమాలినవిగానో కనిపిస్తాయం టూ సందేహాలను వ్యక్తం చేస్తున్నవారు కూడా లేకపోలేదు. గత నెలలో హాస్టల్ విద్యార్థుల మరణాలపైనా తొలుత స్పందించలేదని, ఆ తరువాత మీడియా ముందుకు వచ్చి, లేని వాటర్ ప్లాంట్ ఉన్నట్టుగా బుకాయించారని, మరణాలకు కూడా విద్యార్థులు హాస్టల్ నుంచి ఇళ్లకు వెల్లడం వల్లే జరిగాయనట్టుగా తేల్చేశారని, తాజా సంఘటనపైనా అలాగే వ్యవహరిస్తున్నారు అంటూ పలువురు చర్చించుకుంటున్నారు. ఒక మహిళ తనకు అన్యాయం జరిగిందంటేనే స్పందించని మంత్రి ప్రజా సమస్యల పరిష్కారానికి ఎలా చిత్తశుద్ధి ప్రదర్శిస్తారంటూ వ్యంగ్యాస్త్రాలు సందిస్తు న్నవారు కూడా లేకపోలేదు. రైతులు, గిరిజనులకు పెద్దఎత్తున నష్టం జరిగే దుగ్గేరు పంప్డ్ పవర్ ప్రాజెక్టుపైనా మంత్రి మౌనం వీడడం లేదని జనంలో చర్చనడుస్తోంది. అది ఫేక్ న్యూస్ మాత్రమే కాదు మీడియా ముసుగులో చేస్తున్న మోసం అంటూ సోషల్ మీడియాలో పేర్కొనప్పటికీ సమావేశాల్లో గాని, మీడియా ముఖంగా గాని ఎందుకు నోరు మెదపడం లేదన్నది చర్చనీయాంశంగా మారింది. మంత్రికి చిత్తశుద్ధి ఉంటే మహిళ ఫిర్యాదుపై సమగ్ర విచారణ చేయించాలని కోరుతున్నారు. పంప్డ్ స్టోరేజీపైనా స్పష్టత ఇవ్వాలనే డిమాండ్ పెరుగుతోంది. మొత్తానికి మంత్రి మౌనం చర్చనీయాశంగా మారింది.

ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా

ఆర్‌సిఎంలో ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఆర్‌సిఎంలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో ప్రత్యేకంగా ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశారు. ఈ పోటీలకు కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి హాజరైన వారికి హెచ్.ఐ.వి./ఎయిడ్స్ నివారణ, అవగాహన వంటి అంశాలను తెలియజేస్తూ వేసిన వివిధ రకాల ముగ్గులను కలెక్టర్ ఆసక్తిగా తిలకించారు. ఇటువంటి సృజనాత్మక పోటీలు యువత, ప్రజల్లో ఎయిడ్స్ నియంత్రణపై అవగాహనను బలోపేతం చేస్తాయని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ కె.హేమలత, సబ్ కలెక్టర్ వైశాలి, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కును శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో మండలంలోని తాళ్లబురిడికి చెందిన సిరిపురపు వెంకటరమణకు రూ.92,188 ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు ఆరోగ్య సమస్యలు ఎదురైతే వైద్యం చేయించుకోలేని పరిస్థితి ఉన్న వారికి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవార్డులను అందుకుంటున్న విద్యార్థినులు

యూత్ స్కిల్ పోటీల్లో మెరిసిన ఆదర్శ పాఠశాల విద్యార్థులు

ప్రజాశక్తి - కురుపాం

జిల్లా స్థాయిలో శనివారం నిర్వహించిన యూత్ స్కిల్ పోటీల్లో స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చిన వివిధ విభాగాల్లో జరిగిన పోటీల్లో విద్యార్థులు అప్పారెల్ ట్రేడ్‌లో ప్రథమ స్థానం, ఐటి ట్రేడ్‌లో తృతీయ స్థానం సాధించినట్లు ప్రిన్సిపల్ వి.రామలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదర్శ పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయిలో రాణించడం చాలా సంతోషంగా ఉందని, కానీ ఇంకా రానున్న రోజుల్లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరచాలని, పాఠశాల విద్యార్థులు తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల కృషిని ప్రశంసించి పోటీలకు సిద్ధమై ఉత్తమ ప్రతిభ కనబర్చినందుకు అభినందనలు తెలిపారు.

కడకెల్లలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని నడిమికెళ్ల సచివాలయం పరిధి కడకెల్లలో శనివారం స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, రక్తపోటు, మధుమేహ గర్భిణులు, చిన్నారులు తదితర రకాల రోగులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ శుభారాతమని, ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్‌ఎం, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

మావుడి సోదరులకు ఎమ్మెల్సీ పరామర్శ

ప్రజాశక్తి - మక్కువ

మండల వైసిపి నాయకులు మావుడి సోదరులను ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు శనివారం పరామర్శించారు. మక్కువలోని మావుడి స్వగృహంలో కీర్తిశేషులు అరుణమ్మ చిత్రపటానికి ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత, మాజీ ఎమ్మెల్యే జోగారావు శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో పలువురు వైసిపి శ్రేణులు పాల్గొన్నారు.

ధోనుబాయి ఆశ్రమ పాఠశాల పరిశీలన

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ పరిధిలోని ధోనుబాయి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను ఎపిఒ జి.చిన్నబాబు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా ప్రమాణాల స్థాయిని పరిశీలించారు. అనంతరం ఎపిఒ మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన కొనసాగించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అదే విధంగా విద్యార్థులకు వండి పెడుతున్న భోజనం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు సరిపడేంత భోజనం పెట్టాలని సూచించారు. పదో తరగతి విద్యార్థుల వంద రోజుల ప్రణాళికను సక్రమంగా జరిగేలా చూడాలని హెచ్‌ఎంకు సూచించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి అదనపు తరగతులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సుకుమార్, డిప్యూటీ వార్డెన్, పిడి ఆర్‌సి రెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలో వంటలను పరిశీలిస్తున్న ఎపిఒ చినబాబు

ఆశ్రమ పాఠశాలలో తనిఖీలు

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని సామరెల్లి ఆశ్రమ పాఠశాలను శనివారం ఐటిడిఎ ఉప విద్యాశాఖాధికారి జి.రామమోహనరావు వార్షిక తనిఖీ చేపట్టారు. ప్యానల్ సిబ్బందితో మాట్లాడారు. విద్యా విషయక, పరిపాలన రికార్డులు పాఠశాల నిధులు నిర్వహణ రికార్డులను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులు, పాఠశాల సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. పదో తరగతిలో శత శాతం సాధించాలని విద్యార్థులకు సూచించారు. పదో తరగతి విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదివితే ఉత్తీర్ణత తప్పనిసరి అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆరిక భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలి : సిపిఎం

ప్రజాశక్తి - కొమరాడ

గిరిజన ప్రాంతాల్లో బస్సు సౌకర్యంతో పాటు రోడ్డు సౌకర్యం కల్పించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. మండలంలోని కూనేరు సంతలో శనివారం సిపిఎం ఆధ్వర్యంలో గిరిజనులతో కలిసి నిరసన చేపట్టారు. నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి సాంబమూర్తి, ఎపి గిరిజన సంఘం నాయకులు హెచ్ రామారావు మాట్లాడుతూ పార్వతీపురం నుంచి కూనేరు వరకు నైట్ హాల్ట్ బస్సు నాలుగేళ్లుగా లేదని చెప్పినా పరిష్కారం కాలేదని అన్నారు. పార్వతీపురం నుంచి కూనేరు మీదగా లంజి గ్రామానికి కూడా నాలుగేళ్లుగా బస్సు సౌకర్యం లేదన్నారు. దీంతో గిరిజన, మైదాన ప్రాంత ప్రజలు కూడా ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ విషయమై గతంలో డయల్ యువర్ డిఎం, కలెక్టర్ గ్రీవెన్స్‌లో 11 సార్లు ఫిర్యాదు చేసినా స్పందనలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పై తెలిపిన రూట్లలో బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని కోరారు.

పరిశుభ్రతలో భాగస్వామ్యం కావాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఉన్నత స్థానంలో ఉన్న స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి శ్రమదానం చేసి జిల్లా ప్రజలకు ఆదర్శంగా నిలిచారు. స్థానిక ఆర్‌సిఎంలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయం వద్ద ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం కలెక్టర్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వయంగా పలుగు, పారా పట్టి 'ప్రత్యేక స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర ' కార్యక్రమాన్ని చేపట్టడమే కాకుండా జిల్లా అధికారులందర్నీ భాగస్వాములను చేసి కార్యాలయాలను, ఆవరణలను పరిశుభ్రం చేయించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతకు మనమంతా సమయాన్ని కేటాయించాలని, ఉన్నత స్థానాల్లో ఉన్నా అధికారులు కేవలం ఆదేశాలు ఇవ్వడమే కాకుండా, స్వయంగా క్షేత్ర స్థాయిలో పనిచేస్తే ప్రజల్లో మరింత స్ఫూర్తి పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, నిర్మాణ వ్యర్థాలను తొలగించడం, తద్వారా పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చాలన్నారు. తద్వారా రాబోయే రోజుల్లో జిల్లాలోని ప్రతి గ్రామం, పట్టణం పరిశుభ్రంగా ఉండాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ప్రతి నెలా ప్రతి ఒక్కరూ ఇలాంటి శ్రమదానం కార్యక్రమాలు నిర్వహిస్తే, ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులకు, పౌరులకు స్వచ్ఛత పట్ల మరింత ప్రేరణ కలిగిస్తుందని అభిప్రాయపడ్డారు.

సాలూరు: పట్టణంలోని 23వ వార్డు రామా కాలనీను స్వచ్ఛ వార్డ్ గా గుర్తించి ఆ వార్డులో గల మహిళలతో మన వీధి-మన బాధ్యత కార్యక్రమాన్ని కమిషనర్ టిటి రత్న కుమార్ మున్సిపల్ సిబ్బందితో కలిసి నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ స్థానిక ప్రజలతో మాట్లాడుతూ తమ ఇళ్ల నుంచి వచ్చిన వ్యర్థాలను ఆరుబయట కాలువలో పారబోయకుండా పారిశుధ్య కార్మికునికి తడి, పొడి చెత్త, ప్రమాదకరమైన చెత్తలను వేరుచేసి అందించాలని సూచించారు. తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ తమ వీధులను స్వచ్ఛ వీధులుగా, స్వచ్ఛ వార్డులుగా తీర్చిదిద్దడానికి స్థానిక ప్రజలు సహకరించాలని అవగాహన కల్పించారు. అలాగే వార్డుల్లో రోజువారీ పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా కాలువల్లో పూడిక తీత పనులు, గార్బేజ్ లిఫ్టింగ్ రోడ్డు తుడిపించడం వంటి పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నామని తెలిపారు. వార్డుల్లో ఉన్న షాపులలో, హోటల్లో తప్పకుండా చెత్తబుట్టలు ఏర్పాటు చేసి తమ షాపుల నుంచి వచ్చిన వ్యర్థాలను డెస్ట్ బిన్లలో వేసి పురపాలక సంఘ వాహనానికి అందించాలని, మున్సిపాల్టీ పరిధిలో గల ప్రతి వార్డులో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్టు కమిషనర్ తెలిపారు.

స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా చెత్తను తొలగిస్తున్న కలెక్టర్

ఉపాధ్యాయులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని జోగింపేట కెజిబివి పాఠశాలలో మండల స్థాయిలో మహిళా ఉపాధ్యాయులకు వాలీబాల్ పోటీలను ఎంపిడిఒ ఎంఎల్ఎన్ ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు పోటీల్లో పాల్గొనడం శారీరక, మానసిక ఉల్లాసంగా ఉంటుందన్నారు. విద్యార్థులకు విద్య బోధించడమే కాకుండా వ్యాయామ చేయడం చాలా మంచిదన్నారు. మహిళలు అన్ని రంగాల్లోనూ ముందు ఉంటారన్నారు. కార్యక్రమంలో ఎంఇఒలు జి.సూరిదేముడు, ఎం.వెంకటరమణ వివిధ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే బూర్జ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పురుష ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన ఉపాధ్యాయులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పిఇటిలు డి.గాంధీ, ఎం.శ్రీనివాస్‌తో పాటు ప్రజలు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న మహిళా ఉపాధ్యాయులు

ఉపాధ్యాయులకు మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్

వీరఘట్టం : ఉపాధ్యాయులకు బోధనతో పాటు క్రీడలు ఎంతో అవసరమని డిప్యూటీ డిఇఒ పి.కృష్ణమూర్తి సిబ్బందిని ఆదేశించారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర) ఆవరణలో ఉపాధ్యాయులతో నిర్వహించనున్న మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు పాఠాలు బోధించడం ఎంత ముఖ్యమో అప్పుడప్పుడు క్రీడలు ఆడడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మంచిదని సిబ్బందికి సూచించారు. ఆరోగ్యానికి ఉల్లాసం, ఉత్సాహం మంచిదన్నారు. అంతకుముందు పాఠశాల ఆవరణలో విద్యార్థులచే ప్రేయర్‌కు బదులు వందేమాతరం మన్యం డ్యాన్స్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రతి శనివారం మన్యం డాన్స్ కార్యక్రమం నిర్వహించాలన్నారు. కాగా అన్ని పాఠశాలల్లో అమలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. మండల స్థాయి క్రీడా పోటీల్లో విజయతులైన 16 మంది డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒలు డి.గౌర్నాయుడు, ఆనందరావు, నోడల్ అధికారి సిహెచ్ రత్నాకర్, ప్రధానోపాధ్యాయులు బి.సుంబోర, కెపి నాగమణి, క్రీడాకారులు పాల్గొన్నారు.

సీతంపేట : విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు స్థానిక ఐటిడిఎ గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో ఉపాధ్యాయులకు మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఐటిడిఎ స్పోర్ట్స్ ఇన్‌ఛార్జ్ జాకబ్ దయానంద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉపాధ్యాయులు ఎ.శోభన్‌బాబు, జయప్రకాష్, హిమగిరి ప్రసాదరావు, నవీన్ కుమార్, కోటేశ్వరరావు, రామకృష్ణతో పాటు 16మంది మండల స్థాయికి క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపికైనట్లు జాకబ్ దయానంద్ తెలిపారు. 6,7 తేదీల్లో క్రికెట్ టోర్లమెంట్లో మండల స్థాయిలో ఎంపికైన వారికి డిసెంబర్ 6,7 తేదీల్లో డివిజనల్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తామని, అలాగే జిల్లాస్థాయి కూడా ఉంటుందని తెలిపారు.

బలిజిపేట మండల సమావేశంలో బడ్జెట్‌ను చదువుతున్న ఎఒ నగేష్‌వర్మ

మండల బడ్జెట్ ఆమోదం

ప్రజాశక్తి - బలిజిపేట

2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండల పరిషత్ వార్షిక బడ్జెట్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. వైస్ ఎంపిపి డి.హేమలత అధ్యక్షతన శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల బడ్జెట్ సమావేశం ఎంపిడిఒ శ్రీవాణి నిర్వహించారు. 2025-26 ఆర్థిక సంవత్సరం సవరించిన అంచనా బడ్జెట్ రూ.104 కోట్ల 12 లక్షల 19 వేల 877 కాగా, 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.105 కోట్ల 16 లక్షల 12 వేల 677 అంచనా వేసినట్లు పేర్కొన్నారు. స్త్రీ, శిశు సంక్షేమం, మంచినీటి సరఫరా, పారిశుధ్యం, హౌసింగ్, విద్యుత్తు పెన్షన్ పంపిణీ మొదలగు అంశాల వాటా ఆమోదపు ఖర్చు ఆదాయ వనరులు బట్టి అంచనా వేశారు. ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించిన సభ్యులకు ఎంపిడిఒ కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో జెడ్‌పిటిసి సభ్యులు అలజంగి రవికుమార్, మండల పరిషత్ ఎఒ నగేష్‌శర్మ, ఎంపిటిసి సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కురుపాం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి శెట్టి పద్మావతి అధ్యక్షతన ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో 2026 - 27 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయ ఎఒ పివి నాగభూషణరావు 2025-26 సంవత్సరం సవరించిన అంచనా బడ్జెట్ రూ.68 కోట్ల 49 లక్షల 21 వేలుకు గానూ 2026 -27 సంవత్సర బడ్జెట్ అంచనా రూ. 69 కోట్ల 84 లక్షల 22 వేలు అంచనా వేశామని సభ్యులకు చదివి వినిపించగా, సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపిడిఒ జె.రమేష్ బాబు, జెడ్‌పిటిసి జి.సుజాత, మండల కో-ఆప్షన్ సభ్యులు షేక్ జిలాని, వైస్ ఎంపిపి బి.అన్నాజీ రావు, ఎంపిటిసి సభ్యులు వి. బంగారు నాయుడు, టీవీఎస్ స్వామియోధులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశం వాయిదా

పాలకొండ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపిపి బొమ్మల భాను బడ్జెట్ సమావేశం నిర్వహించగా సభ్యులు తీవ్రంగా వ్యతిరేకించారు. వైసిపి చెందిన ఎంపిటిసి సభ్యులంతా దీన్ని వ్యతిరేకించారు. 15వ ఆర్థిక సంఘం కింద రూ.58 లక్షలు నిధులు మంజూరు కాగా, అందరికీ సమానంగా ఇవ్వకుండా కొన్ని టిసిలకే పరిమితం చేశారని వైస్ ఎంపిపి కనపాక సూర్య ప్రకాష్, ఎంపిడిఒ ఎంవి రంగారావు నిలదీశారు. కనీసం ఎంపిటిసి సభ్యులకు మర్యాద కూడా ఇవ్వడం లేదని కాబట్టి తాము వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ఎంపిపితో పాటు ఏడుగురు సభ్యులు హాజరు కాగా, ఆరుగురు మెజార్టీ సభ్యులు బడ్జెట్‌ను వ్యతిరేకించారు. దీంతో వాయిదా వేస్తున్నట్లు ఎంపిడిఒ ప్రకటించారు.

ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్గవర్గం

ఎపిఎన్‌జిఒ కురుపాం యూనిట్ ఎన్నిక

ప్రజాశక్తి - కురుపాం

ఎపిఎన్‌జిఒ కురుపాం తాలూకా యూనిట్ ఎన్నికలు శనివారం ఏకగ్రీవంగా పూర్తయ్యాయి. నామినేషన్ చివరి రోజు శనివారం కావడంతో అన్ని పదవులకు ఒక్కో నామినేషన్ రావడంతో ఎన్నికల అవసరం లేకుండానే పదవులు ఖరారయ్యాయని ఎన్నికల అధికారులు జొన్నాడ విక్టర్, ఎస్.దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 520 మంది సభ్యులు కలిగిన యూనిట్‌లో అధ్యక్షులుగా ఎస్ఎస్ ప్రకాశరావు, కార్యదర్శిగా ఎ.వెంకటనాయుడు, కోశాధికారిగా ఎ.సాంబశివరావు సహా మొత్తం 14 మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని అన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షులు జివిఆర్ఎస్ కిషోర్ నేతృత్వంలో 150 మంది ఉద్యోగులతో ర్యాలీ నిర్వహించి ప్రభుత్వం వెంటనే పిఆర్‌సి కమిషన్ ఏర్పాటు చేసి ఐఆర్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట ఏజెన్సీలో కిడ్నీ డయాలసిస్ సెంటర్‌ను వెంటనే ప్రారంభించాలని సిపిఎం మండల కార్యదర్శి ఎ.భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీతంపేట ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులకు ఎక్కువగా కిడ్నీ వ్యాధితో ఇబ్బంది పడుతున్నారని అన్నారు. చికిత్స నిమిత్తం సీతంపేట ఏరియా ఆసుపత్రిలో కిడ్నీ సదుపాయాలు ప్రస్తుతానికి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇంకా మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు పూర్తికాకపోవడం వల్ల కిడ్నీ రోగులను ఆసుపత్రిలో సదుపాయం లేకపోవడంతో శ్రీకాకుళం రాగోలు జెమ్స్ ఆసుపత్రికి కిడ్నీ రోగులను తీసుకెళ్లాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. కావున డయాలసిస్ సెంటర్ సీతంపేటలో ఉంచాలన్నారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రానికి వెళ్లడానికి పేద గిరిజనులకు రవాణా ఛార్జీలు చేతి చమురు ఖర్చవుతుందన్నారు. నిరుపేదలైన గిరిజనులు పట్టణాలకు వెళ్లి వైద్యం చేసుకోని స్థితిలో ఉన్నారన్నారు. ఇప్పటికే మండదీసరిగూడకు చెందిన సవర కడాయి, సవర భూగన్న తదితరులు జిల్లా కేంద్రంలో చికిత్స పొందుతున్నారన్నారు.

పోలీసునాయుడు కుటుంబానికి ఎమ్మెల్సీ పరామర్శ

ప్రజాశక్తి -వీరఘట్టం

మండలంలోని బిటివాడకు చెందిన పరుశుబోతు పోలీసు నాయుడు మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ గ్రామానికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. పోలీసునాయుడు మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించి, కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఎమ్మెల్సీతో పాటు వీరఘట్టం మండల ప్రచార విభాగం అధ్యక్షులు వైశ్యరాజు గోవిందరాజు, పాలవలస ధవలేశ్వరరావు, జల్లు జగదీష్, పట్నాన వెంకటరమణ, నీలం శ్రీనివాసరావు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు పిఎసిఎస్ ఛైర్మన్, డైరెక్టర్లు కృతజ్ఞతలు

ప్రజాశక్తి -సీతానగరం

మండలంలో ఇటీవల ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం ఛైర్మన్‌గా నియమితులైన అప్పయ్యపేటకు చెందిన చింతాడ సత్యం, డైరెక్టర్లు శనివారం ఎమ్మెల్యే బోనెల విజయ చంద్రకు కృతజ్ఞతలు తెలిపారు. పార్వతీపురంలోని టిడిపి ఎమ్మెల్యేను నూతన అధ్యక్షులు, డైరెక్టర్లు కలుసుకొని పూలమాలతో సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే విజయచంద్ర సహకారంతో తమకు పదవులు వచ్చాయని, వీటిని రైతుల కోసం ఉపయోగించి ప్రభుత్వానికి ముఖ్యంగా ఎమ్మెల్యేకు మంచి పేరు తీసుకొస్తామని స్పష్టం చేశారు. రైతులకు మంచి సేవలు అందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

పెదరామ జంక్షన్‌లో వాహనాల తనిఖీ

ప్రజాశక్తి -సీతంపేట

మండలంలో పెదరామ జంక్షన్ వద్ద సీతంపేట ఎస్సై వై అమ్మనరావు వాహనాలు తనిఖీ చేపట్టారు. ఏనలైజర్ బ్రీతింగ్ టెస్టింగ్ నిర్వహించారు. మద్యం తాగ వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా వాహనాలు ఎక్కడినుండి వచ్చాయి ఎక్కడికి వెళ్తున్నాయి ఆరా తీశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు హెల్మెంట్ తప్పనిసరిగా ధరించాలన్నారు.

ఎస్‌సి సబ్‌ప్లాన్ నిధుల మళ్లింపుపై నిలదీత

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీలో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు రూ.2కోట్ల 50 లక్షలు బీసీ వార్డులు కేటాయించడం పట్ల 12వ వార్డు కౌన్సిలర్ ప్రతినిధి కోడం విజయకుమార్ శనివారం జరిగిన నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశంలో లేవనెత్తారు. బిసి వార్డులకు ఎస్‌సి సబ్‌ప్లాన్ నిధులు ఇవ్వవచ్చా లేదా అంటూ కమిషనర్ రత్నరాజును నిలదీశారు. తనకు ఎజెండా విషయంతో సంబంధం లేదని, అంతా కౌన్సిలర్లే చూసుకున్నారని కమిషనర్ చెప్పారు. 20వవార్డు కౌన్సిలర్‌ను కూర్చోబెట్టే నిధులు కేటాయించారా అంటూ కమిషనర్ ప్రశ్నించారు. దీనిపై కౌన్సిలర్ కొంచాడ అరుణ్ కుమార్ మాట్లాడుతూ 2014-19లో కూడా సబ్ ప్లాన్ నిధులు మిగిలిన ప్రాంతాలు ఖర్చు చేశారని సమావేశంలో ప్రస్తావించారు. అదేవిధంగా కో-ఆప్షన్ సభ్యులు కొండదాడి విజయ్‌కుమార్ ఈ విషయంపై మాట్లాడుతూ ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు వార్డుల్లో ఖర్చు చేసుకోవచ్చన్నారు. దీనిపై ఐదో వార్డ్ కౌన్సిలర్ వెలమల మన్మధరావు కలుగజేసుకొని మాట్లాడుతూ నగర పంచాయతీలో రెండే ఎస్‌సి వార్డులు ఉన్నాయని, రూ.2కోట్ల 50 లక్షలు అక్కడే ఖర్చు పెడితే మిగిలిన వార్డులు పరిస్థితి ఏమిటని అన్నారు. 12వ వార్డుకు నిధులు కావాలని కోరాలే తప్ప మిగిలిన వార్డుకు ఎందుకు ఇచ్చారని ప్రశ్నించడం సరికాదన్నారు. అదేవిధంగా 9వార్డు కౌన్సిలర్ పల్లా భాను మాట్లాడుతూ పీతల బందలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరుతుంటే తన ఇంటిపై విచారణకు రావడం ఎంతవరకు సమంజసమని కమిషనర్‌ను నిలదీశారు. దీనిపై కౌన్సిలర్లు దుపాడు పాపినాయుడు, కొంచాడ అరుణ, తూముల లక్షణ కమిషనర్ తీరును తప్పు పెట్టారు. ఛైర్‌పర్సన్ ఆకుల మల్లేశ్వరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కౌన్సిలర్లు పాల్గొన్నారు.

దళాయిపేట జెడ్‌పి హైస్కూల్ దత్తత

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని దళాయిపేటలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను టైమ్స్ ఫౌండేషన్ అధినేత, ప్రవాస భారతీయుడు పూనాటి రవీంద్రబాబు దత్తత తీసుకున్నట్లు ప్రకటించారు. ప్రముఖ కథారచయిత గంటేడ గౌరునాయుడు సాహిత్యం అంటే తనకు చాలా ఇష్టమని, ఆయన్ను గురువుగా భావించి వారి గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానని రవీంద్రబాబు తెలిపారు. గంటేడ గౌరునాయుడు స్వగ్రామం దళాయిపేట కావడంతో ఈ గ్రామాన్ని దత్తత తీసుకున్నట్లు ఆయన తెలిపారు. శనివారం పాఠశాలలోని అందరు విద్యార్థులకు ఇంగ్లీష్ గ్రామర్ పుస్తకాలను పంపించగా, వాటిని గంటేడ గౌరునాయుడు, పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు, అమ్మా సేవాసమితి సభ్యులు గంటేడ సోమేశ్వరరావు, గంటేడ చిన్నంనాయుడు, రచయిత చందనపల్లి గోపాలరావు ,ఉపాధ్యాయులు చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. గణితం, సైన్స్ సబ్జెక్టుల్లో 90శాతంకంటే ఎక్కువ మార్కులు వచ్చిన బాలికలు ఇద్దరికి పైచదువులు నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందిస్తానని హామీ ఇచ్చారని గౌరునాయుడు తెలిపారు. మారుమూల తమ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను దత్తత తీసుకుని, విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ, పలు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించిన ప్రవాస భారతీయుడు రవీంద్రబాబుకు గ్రామం, పాఠశాల, ఉపాధ్యాయులు, విద్యార్థుల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థినిలకు ఇంగ్లీష్ గ్రామర్ పుస్తకాలు అందజేస్తున్న గౌరునాయుడు, హెచ్‌ఎం

బస్సుల ఫిట్‌నెస్ తప్పనిసరి : ఎంవిఐ

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలో విద్యార్థులను తరలించే పాఠశాల బస్సులు, ఆటోల భద్రత విషయంలో యాజమాన్యాలు ఏమాత్రం రాజీపడకూడదని సాలూరు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ జెవివిఎస్ ప్రసాద్ స్పష్టం చేశారు. శనివారం స్థానిక ప్రయివేట్ పాఠశాల యాజమాన్యాలు తప్పనిసరిగా బస్సుల ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు బీమా, పర్మిట్లు వంటి అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలను పక్కాగా నిర్వహించాలని ఆయన ఆదేశించారు. పట్టణంలోని అన్ని పాఠశాలల యాజమాన్యాలతో మాట్లాడిన ఎంవిఐ ప్రసాద్ విద్యార్థుల ప్రయాణం సురక్షితంగా ఉండేలా తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత పూర్తిగా పాఠశాలలదేనని తెలిపారు. బస్సులు, ఆటోలు నడిపేందుకు అనుభవం కలిగిన, ఆరోగ్యవంతులైన డ్రైవర్లను మాత్రమే నియమించుకోవాలని, డ్రైవర్ల పూర్తి వివరాలు, లైసెన్స్‌లు పక్కాగా ఉండాలని, ప్రతి బస్సును ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ, బ్రేకులు, టైర్లు, అత్యవసర ద్వారం వంటివి సక్రమంగా ఉండేలా చూసుకోవాలని, బస్సు రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పొల్యూషన్ అండర్ కంట్రోల్ పత్రాలను, బీమాను, పర్మిట్‌ను ఎల్లప్పుడూ అప్‌డేట్ చేసి ఉంచుకోవాలని తెలిపారు.

స్కూల్ బస్సును పరిశీలిస్తున్న ఎంవిఐ ప్రసాద్

3న జాబ్‌మేళా

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డిసెంబర్ 3న స్థానిక గాయత్రి డిగ్రీ కళాశాలలో జరగబోయే జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. ఈ మేరకు శనివారము స్థానిక టిడిపి కార్యాలయంలో జాబ్ మేళాకు సంబంధించిన గోడ పత్రికను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జాబ్ మేళాలో 23 బహుళ సంస్థల ప్రతినిధులు పాల్గొని అర్హులను ఎంపిక చేస్తారన్నారు. పదో తరగతి నుండి పిజి వరకు చదివిన యువతి యువకులు ఈ అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఎంపికైన వారికి అర్హతను బట్టి రూ.10వేలు నుంచి రూ.25వేలు వరకు వేతనం లభిస్తుందన్నారు. ఆసక్తి గల యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు, నైపుణ్యాభివద్ధి సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలపై పర్యవేక్షణ పెంచాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక ఐటిడిఎ ప్రాజెక్టు పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో అధికారులు పర్యవేక్షణ పెంచాలని, గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో మాదిరిగా ఆశ్రమ పాఠశాలల్లో ఉపాధ్యాయులను రాత్రి కనీసం ఒకరు ఉండేలా చర్యలు తీసుకోవాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ కోరారు. ఈ మేరకు శనివారం జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కొమరాడ మండలం పెద కేర్జిల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థులను పరామర్శించారు. జరిగిన సంఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రంజిత్ కుమార్ మాట్లాడుతూ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న వార్డెన్, మేట్రిన్, వాచ్‌మేన్/ఉమెన్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పెద్దఖేర్జిల పాఠశాలలో జరిగిన సంఘటనపైనా, హెడ్ మాస్టర్, డెప్యూటీ వార్డెన్ పనితీరుపై సమగ్ర విచారణ జరిపించాలని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఉపాధ్యాయులు రాత్రి పూట ఉండేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో కల్పించాలని డిమాండ్ చేశారు.